క్లుప్తంగా

ఎంఈఎస్ సివిలియన్ ఇంజినీర్ల సమస్యలు పరిష్కరించాలి

సీతంపేట: ఎంఈఎస్‌లో పనిచేస్తున్న సివిలియన్ ఇంజినీర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపి తమకు రావాల్సిన బెనిఫిట్స్‌ను ఎటువంటి వివక్ష లేకుండా అమలు చేయాలని ఆల్ ఇండియా సివిలియన్ ఇంజినీర్స్ అసోసియేషన్ కోరింది. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కె.రాధాకృష్ణ, సంజీవ్ సుమన్ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం తమకు ఏఈ నుంచి ఈఈ క్యాడర్ వరకు ప్రమోషన్ ఇచ్చేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 124 మంది పదోన్నతులు పొందారని చెప్పారు. సర్వేయర్లకు ఇంజినీరింగ్‌తో అనుసంధానం చేస్తూ వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. గ్రేడ్ పే మొత్తాన్ని పెంచాలని, సివిలియన్లకు టైప్ 3, 4 క్వార్టర్లు నిర్మించాలని, కార్యాలయంలో మెస్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు చతుర్వేది, నితీష్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవ వేంకటేశ్వరుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాలిక అదృశ్యం

సీతమ్మధార: ఓ బాలిక అదృశ్యంపై కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురంలో తలిశెట్టి కన్నెంటి పద్మతో కలిసి కుమార్తె కీర్తిక నివసిస్తోంది. బాలిక పదో తరగతి చదువుకుంది. గతంలో ఒక దుస్తుల దుకాణంలో పనిచేసేది. అక్కడ పనిమానేయండతో తనకు రావాల్సిన డబ్బుల కోసం ఈ నెల 17వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో దుకాణానికి వెళ్లి వస్తానన్న కీర్తిక సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో తల్లి బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్దకు వెళ్లి అడగ్గా రాలేదని చెప్పారు. దుస్తుల షాపు యాజమానికి అడగ్గా బాలిక రాలేదని చెప్పడంతో తల్లి పద్మ కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఎస్ఐ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుంతీ మాధవ స్వామి చందనోత్సవం నేడు



పద్మనాభం: పద్మనాభంలో వెలసిన కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఆదివారం చందనోత్సవం నిర్వహణకు ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కుంతీ మాధవ స్వామిని అలంకరించడానికి అవసరమయ్యే చందనాన్ని సమకూర్చారు. కుంతీ మాధవ స్వామిని శనివారం రాత్రి పది గంటలకు ఆలయ అర్చక స్వాములు చందనంతో అలంకరిస్తారు. ఆదివారం ఉదయం ముందుగా విశ్వక్షేన పూజ, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం ఏడు గంటల నుంచి చందనం అలంకరణలో ఉన్న స్వామిని దర్శించుకోవడానికి భక్తులకు ప్రవేశం కల్పిస్తారు. రెండు రోజుల వరకు కుంతీ మాధవ స్వామి చందనం అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. ఆలయ లోపలి భాగాన్ని, రాజగోపురం ముందు భాగాన్ని మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. కుంతీ మాధవ స్వామి ఆలయం ముందు భాగంలో అరటి చెట్లతో అలంకరించారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

- జీవీఎన్ఎంసీ హైస్కూల్ ప్లస్ బాలికల కళాశాలలో దరఖాస్తుల స్వీకరణ
- ఎంపీసీ–40, బైపీసీ–40 చొప్పున సీట్లు
- ఉచితంగా విద్య, పుస్తకాలు
- నిపుణులైన అధ్యాపకులచే బోధన
- జూన్ 1 నుంచి క్లాసుల ప్రారంభం



సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్ ప్లస్ బాలికల కళాశాల

సీతమ్మధార: నూతన విద్యా విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పలు జీవీఎంసీ ఉన్నత పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసిన విషయం తెలిసిందే. జీవీఎంసీ పరిధి సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని ఎస్ఎంసీ హైస్కూల్‌లో 2022 ఆగస్టులో బాలికల కోసం జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసింది. ఆంగ్ల మాధ్యమంలో విద్యను ప్రవేశపెట్టింది. విద్యార్థినుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదని, వారు ఉన్నత విద్య అందుకుని ఉజ్వల భవిష్యత్తు పొందడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

రెండు గ్రూప్‌లు.. 80 సీట్లు

పీ అండ్ టీ కాలనీలోని నెహ్రూ నగర పాలక ఉన్నత పాఠశాలను జీవీఎస్ఎంసీ హైస్కూల్ ప్లస్ బాలికల కళాశాలగా అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లను బాలికల కోసం ప్రారంభించారు. ఎంపీసీ–40, బైపీసీ–40 చొప్పున మొత్తం 80 సీట్లు కేటాయించారు. గతేడాది 14 మంది ఎంపీసీ, 12 మంది బైపీసీ విద్యార్థినులు ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాయగా.. వారిలో పాసైన వారు డిగ్రీకి ప్రమోట్ అయ్యారు.

మొత్తం సీట్లు భర్తీ అయ్యేవరకు అడ్మిషన్లు

ఎస్ఎంసీ హైస్కూల్ ప్లస్‌లో ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని హెచ్ఎం రాంప్రసాద్ తెలిపా రు. ఈ ఏడాదిలో ప్రస్తుతానికి ఎంపీసీలో 14 మంది, బైపీసీలో 18 మంది చొప్పున విద్యార్థినులు చేరినట్లు చెప్పారు. జూన్ 1 నుంచి ఇంటర్ క్లాసు లు ప్రారంభమవుతాయన్నారు. మొత్తం సీట్లు భర్తీ అయ్యేవరకు అడ్మిషన్లు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు, మధ్యాహ్న భోజనంతోపాటు ఉచితంగా ప్రభుత్వ హాస్టల్ సదుపాయం కూడా ఉందని చెప్పారు. టెన్త్ పూర్తయిన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇంటర్‌లో చేరాలని కోరారు. దాతల సహకారంతో విద్యార్థినులకు టెస్ట్, నోట్‌బుక్‌లు ఉచితంగా అందిస్తామన్నారు. ప్రైవేటు కాలేజీల వైపు పరుగులు తీయకుండా ప్రభుత్వ కళాశాలల్లో చేరి ఉన్నత భవితను పొందాలని కోరారు.

ఇవీ ప్రత్యేకతలు..

నగరం నడిబొడ్డున సీతమ్మధారలోని విశాలమైన ప్రాంగణంలో గల ఎస్ఎంసీ హైస్కూల్ ప్లస్‌లో అత్యున్నత విద్యార్హతలు(పీజీ), అంకితభావం గల అధ్యాపక బృందంచే నాణ్యమైన, క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నారు. తెలుగు మీడియం విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. పోస్టు గ్రాడ్యుయేట్ అధ్యాపక సిబ్బంది జి.ఎస్.వి.వరలక్ష్మి–తెలుగు, కె.వై.విక్టర్–ఇంగ్లిష్,


ఇంటర్ ఎంపీసీ గ్రూప్‌లో చేరుతున్న విద్యార్థిని

జి.జి.ప్రియదర్శిని–మ్యాథ్స్, పి.త్రినాథమూర్తి– ఫిజిక్స్, పి.సంధ్యారాణి–కెమిస్ట్రీ, ఇ.భవానీ–బోటనీ, ఎస్.భారతి–జువాలజీ సబ్జెక్టులు బోధిస్తారు.

ఆడపిల్ల చదువు.. అవనికి వెలుగు

'ఆడపిల్ల చదువు.. అవనికి వెలుగు' అని నిరూపిద్దామనే ఆశయంతో బాలికలను విద్యలో ప్రోత్సహిస్తున్నారు. ఇదే స్కూల్‌లో పదో తరగతితోపాటు ఇంటర్ చదువుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటామని విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలలను సాకారం చేస్తూ బంగారు భవితను పొందుతామని ఆకాంక్షిస్తున్నారు.

నేడు శ్రీనివాస కల్యాణం


సిద్ధమవుతున్న కల్యాణ వేదిక

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీనివాసుడి కల్యాణం నిర్వహిస్తున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో శనివారం ఏర్పాట్లు చేపట్టారు. ఇందుకు అవసరమై భారీ స్టేజీని సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగణంతోపాటు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం ఎదురు సన్నాహ ఉత్సవం జరుగుతుంది. సాయంత్రం శ్రీనివాసుడి కల్యాణం నిర్వహిస్తారు. ఇందుకు అవసరమైన ద్రవ్యాలను సిద్ధం చేశారు.


విద్యుద్దీపాలతో అలంకరించిన ప్రాంగణం

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన


తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు

మురళీనగర్: వాకర్స్ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. వాకర్స్ పార్కులో శనివారం నిర్వహించిన క్లబ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, రానున్న రోజుల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాల విస్తృతికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవి శిక్షణలో భాగంగా 110 మంది విద్యార్థులకు చదరంగంలో ఉచితంగా శిక్షణ ఇచ్చామని చెప్పారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సొంత భవనం నిర్మాణానికి తమ వంతు విరాళాలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 23న బుద్ధ పూర్ణిమ, 26న ఎన్ఆర్ఐ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి ఆర్.సత్యనాథం, వాకర్స్ క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, కోశాధికారి జె.కూర్మారావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్ పూర్వాధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఎం.భాస్కరరావు, సిహెచ్.కృష్ణమూర్తి, సత్తి సునీల్‌రెడ్డి, కె.ద్వారకానాథ్, ఉపాధ్యక్షుడు ఎ.వి.సుబ్బారావు, కార్యదర్శి సిహెచ్.ప్రసాదరావు, జాలీ వాకర్ ఎన్.ప్రకాశరావు, బోర్డు సభ్యులు విజయలక్ష్మి, టి.వి.రమణ, ఆర్.నాగేశ్వరరావు, ఎస్.రామ్మోహన్‌రావు, వై.దేముడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షుడు చంద్రమౌళి

ఘనంగా ఎర్నిమాంబ తొలేళ్ల సంబరం


అమ్మవారి ఘటాలతో వస్తున్న భక్తులు


గుర్రపు రథంపై ఊరేగుతున్న ఎర్నిమాంబ

కంచరపాలెం: కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పూర్ణా మార్కెట్ దుర్గాలమ్మ ఆలయం వద్ద అమ్మవారి ఘటాలతో బయలుదేరారు. కొబ్బరితోట, అల్లిపురం, అచ్చియ్యమ్మపేట, రైల్వేస్టేషన్, కాన్వెంట్ కూడలి, జ్ఞానాపురం పుట్టబంగారం వద్దకు వాటిని చేర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నేలవేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షించాయి. అనంతరం ఆలయం వద్ద మాలధారులైన భక్తులు అగ్నిగుండాలు తొక్కారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఇష్టారాజ్యంగా ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు


నక్కవానిపాలెంలో ఫుట్‌పాత్‌పై వ్యాపార సామగ్రి


తహసీల్దార్ కార్యాలయం పక్క రోడ్డులో వెలసిన దుకాణాలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో ప్రజా ప్రయోజనార్థం నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. నక్కవానిపాలెంలోని ఫుట్‌పాత్‌లను పలువురు వ్యాపారులు ఆక్రమించి ఇష్టారాజ్యంగా వ్యాపారాలు సాగిస్తున్నారు. పాదచారులు నడవడానికి కూడా వీలు లేకుండా పరిస్థితి నెలకొంది. వ్యాపార సామగ్రి, వాటర్ బాటిళ్లు, మిక్చర్ ప్యాకెట్లను తోరణాలుగా కాలిబాటలపై వేలాడదీయడంతో పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం పక్క రోడ్డులో ఇటీవల బిర్యాని పాయింట్ ఏర్పాటు చేశారు. ఏకంగా రోడ్డుపైనే గ్యాస్ స్టవ్ పెట్టి వాహనచోదకుల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. నక్కవానిపాలెంలో ఫుట్‌పాత్‌లు ఖాళీ లేకుండా విచ్చలవిడిగా వ్యాపారులు చేస్తున్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో టిఫిన్ షాపులు, కూరగాయల వ్యాపారాలు ఫుట్‌పాతులపైనే నిర్వహిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో కోట్లాది రూపాయలతో పాదచారుల కోసం నిర్మిస్తున్న ఫుట్‌పాత్‌లు ఇలా ఆక్రమణకు గురవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'ఉత్తర'లో ప్రశాంతంగా ఎన్నికలు

- కుటుంబ కలహాలను పార్టీపై రుద్దొద్దు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు



సీతమ్మధార: ఈ నెల 13న ఉత్తర నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు తెలిపారు. శనివారం 'సాక్షి'తో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, అధికారులు చర్యలు తీసుకోవడంతో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయన్నారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల అనంతరం నియోజకవర్గ పరిధిలో కుటుంబ కలహాలతో జరిగిన ఒక గొడవను వైఎస్సార్‌సీపీపై రుద్దేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నించాయని ఆరోపించారు. ఈ సంఘటనపై పోలీస్ అధికారులు విచారణ జరిపి రాజకీయాలకు.. గొడవకు ఎటువంటి సంబంధం లేదని ప్రకటించారన్నారు. ప్రతిపక్ష నాయకులు వైఎస్సార్‌సీపీ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు ప్రయత్నించడం తగదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పేలా త్వరలోనే ఎన్నికల ఫలితాలు వస్తాయని కె.కె.రాజు అన్నారు.

పరిపాలన విభాగాల పరిశీలన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలోని పలు విభాగాలను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ శనివారం పరిశీలించారు. పరిపాలన భవనంలో పనిచేస్తున్న విభాగాలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. కార్యాలయాల ఆధునీకీకరణ, అవసరమైన మార్పులు చేపట్టడం, మరమ్మతులు, తదితర అంశాలపై సిబ్బంది సూచనలు స్వీకరించారు. ప్రతీ విభాగాన్ని పూర్తి స్థాయిలో ఆధునికీకరించడం, విద్యార్థులకు, ఉద్యోగులకు మరింత సమర్థంగా సేవలు అందించడం లక్ష్యంగా పని చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ వెంట అధికారులు సాంబమూర్తి, గోపాలకృష్ణ, రమణా రెడ్డి, తులసీరామ్, ఇమాన్ ఉన్నారు.


కార్యాలయాలు పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఓటర్లలో చైతన్యం


బీవీకే కాలేజీలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

- 'ఉత్తర'లో పెరిగిన ఓటింగ్ శాతం
- ఓటు హక్కు వినియోగించుకున్న 64.63 శాతం మంది ప్రజలు

సీతంపేట: ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గ ఓటర్లు ఓటేసేందుకు పోటెత్తారు. గత ఎన్నికల్లో కంటే మించి పోలింగ్ శాతం నమోదైంది. ఓటర్లలో చైతన్యం పెరగడంతో ఎండను సైతం లెక్క చేయకుండా ఉదయం నుంచి రాత్రి వరకు క్యూలైన్‌లో నిలబడి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019 ఎన్నికల్లో 62.65 శాతం పోలింగ్ నమోదు కాగా.. 2024 ఎన్నికల్లో 64.63 శాతం మంది ప్రజలు ఓటేశారు.

నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల వారీగా నమోదైన ఓట్ల వివరాలిలా..

- జీవీఎంసీ 25వ వార్డులో మొత్తం 19 పోలింగ్ బూత్‌ల్లో 21,449 మంది ఓటర్లు ఉండగా.. 13,833 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వార్డులో 64.49 శాతం ఓటింగ్ నమోదైంది. 149 బూత్‌లో అత్యల్పంగా 55 శాతం, 140 బూత్‌లో అత్యధికంగా 76 శాతం ఓటింగ్ జరిగింది.

ఉత్తర నియోజకవర్గంలో ఓటింగ్ వివరాలు	
మొత్తం ఓటర్లు :	2,85,789
పోలైన ఓట్లు :	1,84,703
పోలింగ్ శాతం :	64.63%

- 26వ వార్డులోని 21 పోలింగ్ కేంద్రాల్లో 18,501 మంది ఓటర్లు ఉండగా.. 11,688 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. 63.17 శాతం ఓటింగ్ నమోదైంది. 114 బూత్‌లో అత్యల్పంగా 51 శాతం, 108 బూత్‌లో అత్యధికంగా 74 శాతం పోలింగ్ జరిగింది.
- 43వ వార్డులోని 18 పోలింగ్ కేంద్రాల పరిధిలో 19,156 మంది ఓటర్లు ఉండగా.. 11,716 మంది ఓట్లేశారు. 61.16 శాతం ఓటింగ్ నమోదైంది. 132 బూత్‌లో అత్యల్పంగా 50 శాతం, 119 బూత్‌లో అత్యధికంగా 82 శాతం ఓటింగ్ జరిగింది.
- 44వ వార్డులోని 18 పోలింగ్ బూత్‌ల పరిధిలో 17,808 ఓటర్లు ఉండగా.. 11,561 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 64.9 శాతం ఓటింగ్ నమోదైంది. 89 బూత్‌లో అత్యల్పంగా 55 శాతం, 67 బూత్‌లో 80 శాతం ఓటింగ్ జరిగింది.

జూ.. సందర్శకుల క్యూ

వేసవి సెలవులు కావడంతో ఇందిరాగాంధీ జూ పార్కుకు సందర్శకుల తాకిడి పెరుగుతోంది. పాఠశాలల విద్యార్థులు ఎక్కువగా జూ పార్కును సందర్శించారు. కొంత సేపు వన్యప్రాణులను తిలకించి ఎంజాయ్ చేశారు. ఇక్కడ వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద వారంతా గంటల తరబడి సందడి చేశారు. నీటి ఏనుగులు, తెల్ల పులులు, కోతులు, లవ్ బర్డ్స్, వివిధ రకాల పక్షులు, జిరాఫీలు, అడవి దున్నలు నెమళ్లు, ఏనుగులు సందర్శకులను అలరించాయి. వాటి ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ కనువిందు చేశాయి. పిల్లలు, పెద్దలు వన్యప్రాణులను ఫొటోలలో బంధించారు. కొందరు వాటి ఎదురుగా వెళ్లి సెల్ఫీలు దిగారు. దీంతో జూ పార్కు సందడిగా మారింది.

– ఆరిలోవ


కొలనులోకి దిగుతున్న నీటి ఏనుగులు


జిరాఫీ ఎన్‌క్లోజర్ వద్ద సందర్శకులు

కల్యాణం.. కమనీయం

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం శ్రీవారి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా స్వామివారికి సుప్రభాత సేవ, విశేష పూజలు జరిపారు. సాయంత్రం గోదా, పద్మావతి సమేత స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీవారి కల్యాణాన్ని కనులారా తిలకించారు. ఈవో నీలిమ ఆధ్వర్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం సాగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు ఆశీస్సులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు.


శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు